క్లుప్తంగా

ప్రచార రథానికి పూజలు

కొవ్వూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకట్రావు ప్రచార రథానికి సోమవారం కుమారదేవం గండి పోశమ్మ అమ్మవారి ఆలయం వద్ద పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ గంధం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు చేశారు. ఆయన వెంట కుమారదేవం ఎత్తిపోతల పథకం రైతు సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఉండ్రాజవరం: పాలంగి మెయిన్ సెంటర్ వద్ద 11 కేవీ లైన్ పనుల నిమిత్తం మంగళవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పాలంగి, కె.సావరం టీచర్స్ కాలనీ పరిసర ప్రాంతాల్లో గృహ, వాణిజ్య, అగ్రికల్చర్ ఫీడర్లకు 3ఫేస్ సప్లయికు అంతరాయం కలుగుతుందని నిడదవోలు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వీరభద్రరావు సోమవారం తెలిపారు.

9న జాతీయ మెగా లోక్ అదాలత్


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కొవ్వూరు: మార్చి తొమ్మిదో తేదీన కొవ్వూరులో నిర్వహించే జాతీయ మెగాలోక్ అదాలత్‌లో రాజీ మార్గం ద్వారా కక్షిదారులు కేసు పరిష్కరించుకోవాలని జిల్లా తొమ్మిదో అదనపు జడ్జి ఎస్.శ్రీనివాసరావు కోరారు. సోమవారం పట్టణంలో జిల్లా కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకోవడం ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతాయన్నారు. ఎక్కువ కేసులు రాజీ మార్గం ద్వారా పరిష్కరించడానికి న్యాయవాదులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. న్యాయవాదుల సంఘం అధ్యక్షురాలు బొబ్బా భారతీ, ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన ఉండాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న రాజేంద్రప్రసాద్

గోపాలపురం: బాలల హక్కులపై అవగాహన ఉండాలని ఏపీ రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు జె.రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలను సోమవారం ఆయన తనిఖీ చేశారు. ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రతపై దృష్టి సారించాలని, అన్నింటా ముందు ఉండాలని, బాలల హక్కుల గురించి తెలుకోవాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పిన్సిపాల్ తాళ్లూరి ఉమాదేవి, సిబ్బంది పాల్గొన్నారు.

నాక్ బృందం పర్యటన

నిడదవోలు: స్థానిక ఎస్వీఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం నాక్ బృందం పర్యటించింది. నాక్ చైర్మన్ పంజాబ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వినోద్‌కుమార్ గార్గ్ ఆధ్వర్యంలో నాక్ సభ్యులు కళాశాలను పరిశీలించారు. కళాశాల పూర్తి వివరాలను తీసుకున్నారు. కళాశాలలో బోధిస్తున్న అన్ని సబ్జెక్టుల విభాగాల్లో రికార్డులను పరిశీలించి, అధ్యాపకులను ప్రశ్నలు అడిగి సమాచారాన్ని సేకరించారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మాట్లాడి కళాశాల స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థు స్కిట్లు, డ్యాన్సులు, పాటలు ప్రదర్శించారు. ఈ పరిశీలన మంగళవారం కూడా కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.జ్యోతి పేర్కొన్నారు.

వైభవంగా నరసన్న కల్యాణం

నల్లజర్ల: భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నల్లజర్లలోని శ్రీరామభక్త మందిరంలో సోమవారం రాత్రి లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. వేదపండితులు ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ నాయకుడు వెల్లంకి వెంకట సుబ్రహ్మణ్యం దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

పెరవలి: కాకరపర్రులో శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణ మహోత్సవంలో భాగంగా స్వామి అమ్మవార్లకు లక్షతులసీ పూజ సోమవారం ఘనంగా నిర్వహించారు.

రైతులకు చెక్కుల అందజేత


శంకరాపురంలో చెక్కును అందజేస్తున్న రామారావు

నిడదవోలు రూరల్: రైతుల సంక్షేమానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు అన్నారు. శంకరాపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో 16 మంది రైతులకు పంట రుణాలు, పాడి పశువుల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు రూ.30 లక్షల రుణాలకు సంబంధించిన చెక్కులను సోమవారం ఆయన అందజేశారు. సొసైటీ ద్వారా రైతులకు అన్నివేళలా అండగా ఉంటామని ఆయన చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు కాల్దారి శ్రీను, సొసైటీ కార్యదర్శి పి.ప్రకాశరావులు పాల్గొన్నారు.

మంచి చేసేవాళ్లకు దేవుడు తోడుగా నిలుస్తాడు



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి వనిత

పాస్టర్ల ఫెలోషిప్ ఆత్మీయ సమావేశంలో మంత్రి వనిత

దేవరపల్లి, గోపాలపురం: మంచి చేసే వాళ్లందరికీ దేవుడు తోడుగా నిలిస్తాడని రాష్ట్ర హోం, విపత్తుల శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. యర్నగూడేం ఆర్ కన్వర్షన్ కల్యాణ మండపంలో సోమవారం గోపాలపురం నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి వనిత మాట్లాడుతూ దేవుడు, ప్రజల ఆశీస్సులతో రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా దేవునిపై నమ్మకంతోనే ప్రజలకు సేవచేస్తున్నట్టు పేర్కొన్నారు. ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు రెవ డాక్టర్ ప్రతాప్‌సిన్హా, క్రిష్టియన్ కార్పొరేషన్ చైర్మన్ మేడిద జాన్సన్, డాక్టర్ విక్టర్ టాటా, బిషప్ జోషఫ్, షేక్ గపూర్ తదితర పాస్టర్లు తమ సందేశాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేవీకే దుర్గారావు, జెడ్పీటీసీ సభ్యురాలు పి.స్వర్ణలత, ఏఎంసీ చైర్మన్ గన్నమని జనార్దన్, మండల పార్టీ అధ్యక్షుడు కూచిపూడి సతీష్, గెడా జగదీష్, ఆచంట అనసూయ, నరహరిశెట్టి రాజా మండల వైఎస్సార్ సీపీ నాయకులు గోపాలపురం, దేవరపల్లి, నల్లజర్ల, ద్వారకాతిరుమల మండలాల పాస్టర్లు పాల్గొన్నారు.

రాష్ట్రంలో స్వర్ణయుగ పాలన

- కొవ్వూరు నియోజక వర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు
- తాడిపూడిలో పాదయాత్ర


తాడిపూడిలో పర్యటిస్తున్న నియోజక వర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్యే తలారి వెంకటరావు

తాళ్లపూడి: రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలకు సువర్ణ పాలన మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందజేశారని కొవ్వూరు నియోజక వర్గ ఇన్‌చార్జి, గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకటరావు అన్నారు. మండలంలోని తాడిపూడిలో సోమవారం ప్రజా ఆశీర్వాద యాత్ర కార్యక్రమంలో భాగంగా నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి తలారి వెంకటరావు గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించి, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని సిద్ధం కరపత్రాలను అందజేసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు ఆయనకు స్వాగతం పలికి హరతులు ఇచ్చారు. తమకు మేలు చేసిన ఈ ప్రభుత్వానికి రుణపడి ఉంటామని మళ్లీ గెలిపించుకుంటామని తెలిపారు. ముందుగా పంచాయతీ తాగునీటి కుళాయిలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు, జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోశిన శ్రీలేఖ, గ్రామ సర్పంచ్ నామా శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కాకర్ల వెంకటేశ్వరరావు, మాజీ ఏఎంసీ చైర్మన్లు బండి అబ్బులు, వల్లభశెట్టి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు తిరుమలశెట్టి అన్నవరం, మండిగ గిరి, కొలుకుల సత్యనారాయణ, ముదునూరి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ చిరస్మరణీయుడు


శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న నాయకులు

కొవ్వూరు: భారత దేశ సనాతన ధర్మాన్ని కాపాడడం కోసం అనేక యుద్ధాలు చేసిన ఛత్రపతి శివాజీ మహారాజ్ ఎప్పటికీ చిరస్మరణీయుడని ఛత్రపతి శివాజీ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర పేర్కొన్నారు. శివాజీ జయంతి సందర్భంగా పట్టణంలో ఒకటో వార్డు రాజీవ్ కాలనీలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.శివాజీ శౌర్యం, నాయకత్వం, పరిపాలన చతురత గురించి నేటి తరాలు తెలుసుకోవాలన్నారు. ప్రముఖ న్యాయవాది టీఎస్వీ రమణమూర్తి, మాజీ మంత్రి కారుపాటి వివేకానంద, పట్టణ బీజేపీ అధ్యక్షుడు మడిచర్ల రామచంద్రరావు, బీజేపీ నియోజకవర్గ కో-కన్వీనర్ బోడపాటి ముత్యాలరావు, మండల బీజేపీ అధ్యక్షుడు పెరుగు పోతురాజు, నాయకులు చెరుకూరి సాయిరాజు, యనమదల సుబ్రహ్మణ్యం, తాడిమళ్ల విజయవాణి, గంగ్రోతు పవన్ సోమరాజు, బెనుగు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

శివాజీ జయంతి

గోపాలపురం: ఛత్రపతి శివాజీ జీవిత చరిత్రను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని శివాజీ యువసేన నాయకుడు గెల్లా శ్రీనుబాబు పిలుపునిచ్చారు. ఛత్రపతి శివాజీ జయంతిని సోమవారం గోపాలపురంలో ఘనంగా నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో శివాజీ యువసేన నాయకులు బొడ్డు వీరరాఘవులు, వేముల పల్లి నరేంద్ర, వడ్డీ మలీలాదర్, గురుమూర్తి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతిని తాళ్లపూడి హిందూ బంధువుల ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ వీధిలో శివాజీ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు ఇందుగుల రామకృష్ణ, తాటికొండ అమ్మిరాజు, చెక్క నాగేశ్వరావు, సోలస రాంబాబు, చిట్టూరి వెంకటరాజు, కడలి కిరణ్ పాల్గొన్నారు. రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వద్ద ప్రధానోపాధ్యాయుడు డి.దుర్గారావు ఆధ్వర్యంలో చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.

ఎంపీ సుబ్బారెడ్డికి అభినందనలు


సుబ్బారెడ్డిని సత్కరిస్తున్న అక్షయపాత్ర శ్రీనివాస్, మల్లేశ్వరరావు

కొవ్వూరు: రాజ్యసభ సభ్యుడిగా ఎంపికైన వైవీ సుబ్బారెడ్డిని కొవ్వూరు శ్రీరామ సొసైటీ అధ్యక్షుడు అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర సోమవారం తాడేపల్లిలోని ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. చాగల్లు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చెల్లింకుల దుర్గా మల్లేశ్వరరావు అభినందనలు తెలిపిన వారిలో ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో చిన్నారికి తీవ్ర గాయాలు

గోపాలపురం: ఆగిఉన్న లారీని మోటారుసైక్లిస్టు ఢీకొనడంతో చిన్నారికి గాయమైన సంఘటన సోమవారం గోపాలపురం గ్రామ శివార్లలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుట్టాయగూడెం నుంచి గోపాలపురం చిట్యాల మోటార్‌సైకిల్‌పై తూతిగ నరసింహమూర్తి తన మనుమరాలితో వస్తుండగా గోపాలపురం శివారులో ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొన్నాడు. దీంతో సంవత్సరం చిన్నారి సాత్విక తలకు బలమైన గాయమైంది. వెంటనే గోపాలపురం సీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్సై కర్రి సతీష్‌కుమార్ తెలిపారు.

రోడ్డు కం రైలు వంతెనపై నుంచి దూకి వ్యక్తి గల్లంతు?

కొవ్వూరు: రోడ్డు కం రైలు వంతెనపై నుంచి ఒక వ్యక్తి దూకి గల్లంతైనట్లు ఉండవచ్చునని పట్టణ పోలీసులు భావిస్తున్నారు. బ్రిడ్జిపై 133వ స్తంభం సమీపంలో మోటారు సైకిల్, చెప్పులు విడిచిపెట్టి ఉన్నాయని పట్టణ పోలీసులు చెబుతున్నారు. మోటారు సైకిల్ నంబర్ ఆధారంగా విచారణ చేస్తే పట్టణంలో ఇందిరమ్మ కాలనీకి చెందిన నార్కెడ్‌మిల్లి ప్రవీణ్‌కు చెందినదిగా గుర్తించారు. ప్రవీణ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడని, సోమవారం ఉదయం నుంచి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. వాస్తవంగా నదిలో దూకినట్లు స్పష్టమైన ఆధారాల్లేవని పట్టణ పోలీసు చెబుతున్నారు. కుటుంబ సభ్యులను విచారణ చేస్తున్నామని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు చెబుతున్నారు.

స్నేహితులకు ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న స్నేహితులు

దేవరపల్లి: యర్నగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004-05లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు హెల్పింగ్‌హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ ఏర్పాటు చేసి ఆపదలో ఉన్న విద్యార్థులను ఆదుకుంటుంటున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన తోటి స్నేహితురాలు తడికమల్ల జ్యోతికి సోమవారం రూ.3వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఇందిరకు రూ.17వేలు, స్వతంత్రకు రూ.3వేల సహాయాన్ని అందజేసినట్టు టి.ప్రసాద్, బాలకృష్ణ తెలిపారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- మహిళలే వైఎస్సార్ సీపీకి బలం
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు



రుణమాఫీ నమూనా చెక్కును మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ సమన్వయ కర్త గూడూరి శ్రీనివాస్

పెరవలి: మహిళా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. నడుపల్లిలో సోమవారం కానూరు, ఉసులుమర్రు, నడుపల్లి కోట, కానూరు అగ్రహారం, తీపర్రు గ్రామాలకు చెందిన డ్వాక్రా మహిళలకు నాలుగో విడత వైఎస్సార్ ఆసరా రుణమాఫీ చెక్కును అందించారు. అనంతరం జరిగిన ఆసరా సంబరాల్లో ఆయన పాల్గొని ప్రసంగించారు. ముందుగా దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అభిమానంతో సీఎం జగన్ చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ నిడదవోలు నియోజకవర్గంలో డ్వాక్రా సంఘాలు 4817 ఉంటే, వీటిలో 47,812 మంది సభ్యులు ఉన్నారని తెలిపారు. పెరవలి మండల పరిధిలో 1531 డ్వాక్రా సంఘాలు ఉంటే వీరిలో 15,346 మంది లబ్ధిదారులకు రూ.18.64 కోట్లు నమూనా చెక్‌ను ఆయన అందజేశారు. వైఎస్సార్ సీపీతో అన్ని వర్గాల ప్రజలు మంచి జరిగిందన్నారు. రాజమహేంద్రవరం పార్లమెంటరీ సమన్వయకర్త గూడూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజల జీవన ప్రమాణాలు పెంపొందించేలా జగనన్న సంక్షేమ పథకలు అమలు చేసారన్నారు. ఎన్నికల్లో ఆయనకు ఓటు వేసి గెలుపించుకుందాని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు వరుణ్‌సాయి, ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, ఎంపిడిఓ కె హిమ మహేశ్వరి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమళ్ళ సత్యనారాయణ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కాలాబత్తుల సుజాత, మండల సమైఖ్య అధ్యక్షురాలు ఆగర్తి స్వరూపారాణి, జెడ్పిటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, రాష్ట్ర ఇరిగేషన్ కార్పొరేషన్ సభ్యురాలు దొడ్డిగర్ల స్వాతి, సర్పంచ్ బీరా సత్యవేణి రాజు, నాగరాజు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

పెరవలి: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే జి. శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. ఉసులుమర్రులో సోమవారం రూ.23.94 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.41.80 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాలను ప్రారంభించారు. అలాగే రూ.79.00 లక్షలతో నిర్మించనున్న పైప్‌లైన్ విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే శ్రీనివాసనాయుడు మాట్లాడుతూ ఉసులుమర్రు గ్రామంలో ఇప్పటివరకు రూ.9.40 కోట్ల వ్యయంతో వివిధ అభివృద్ధి పనులు చేశామని, గ్రామంలో అరులైన వారందరికీ నాలుగేళ్ల పాలనలో రూ. 25.57 కోట్ల సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేశామన్నారు. ప్రభుత్వ పాలనను సచివాలయాల ద్వారా గ్రామాలకు చేర్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని కొనియాడారు. అన్ని పథకాలు అమలు కావాలన్నా రాష్ట్రానికి సుపరిపాలన కావాలన్నా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డే రావాలన్నారు. ఎన్నికల్లో అందరం ఆయనకు అండగా ఉందమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యురాలు కొమ్మిశెట్టి రామాంజనీ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వీరమళ్ల సత్యనారాయణ, ఎంపీడీఓ కె.హిమమహేశ్వరి, వ్యవసాయాధికారిణి మేరీ కిరణ్, సర్పంచ్ వీరమళ్ల నాగలక్ష్మి, ఎంపీటీసీ జన్ని వరలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్ రామడుగుల సూర్య నారాయణ, దొలారి శ్రీనివాస్, తోట సత్యనారాయణ, దేవరపు శ్రీను, సంగిశెట్టి వాసు, ముత్యాల అన్నవరం, కొయ్యే ధనలక్ష్మి, పార్టీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన గ్రేడ్-5 కార్యదర్శులు


హోంమంత్రి తానేటి వనితను కలిసిన కార్యదర్శులు

నల్లజర్ల: గ్రేడ్-5 కార్యదర్శులకు(డీడీఓ)డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ అధికారాలు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీఓ జారీ చేయడంపై వారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గ్రేడ్-5 కార్యదర్శులు సోమవారం హోంమంత్రి తానేటి వనితను కలసి పుష్పగుచ్చం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి వనిత మాట్లాడుతూ గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించాలని సూచించారు.

ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యం

ఉండ్రాజవరం: ప్రతి ఒక్కరూ ఆర్థికంగా ఎదగాలన్నదే లక్ష్యంగా పని చేస్తున్నామని బహుజన ఫౌండేషన్ చైర్మన్ వైవీ రావు అన్నారు. బహుజన ఫౌండేషన్ ఆధ్వర్యంలో మోర్త గ్రామంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ కేంద్రంలో సెల్‌ఫోన్, రిపేరింగ్, నైపుణ్య అభివృద్ధి, టైలరింగ్, నిరుద్యోగ నిర్మూలనకు ఉపాధి, కంప్యూటర్ విద్య, ఆర్థిక విషయాలపై అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వై.వి.రావు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మరిన్ని అవగాహన కేంద్రాలకు ఫౌండేషన్ శ్రీకారం చూట్టిందన్నారు. ప్రతి కుటుంబానికి అండగా బహుజన ఫౌండేషన్ ఉంటుందన్నారు. మూడు బ్రాంచ్‌లుగా ఉన్న ఫౌండేషన్ రాబోయే రోజుల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 బ్రాంచ్‌లుగా అభివృద్ధి చేసి వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లీగల్ అడ్వజర్ ఎం.శ్యామ్‌సన్, బహుజన సమాజ్ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ చిత్రసేన్, సామాజిక వేత్త చిర్రా గోపాల్, సీఐటీయూ మండల కన్వీనర్ ఏవీ సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురి అరెస్టు

నిడదవోలు రూరల్: సమిశ్రగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై ఎస్ఎస్‌వీ రమేష్ సోమవారం తెలిపారు. వారి నుంచి రూ.1500 నగదు, ఒక కోడి, కత్తిని స్వాధీనపర్చుకున్నామని ఎస్సై పేర్కొన్నారు.

మృతుడి ఆచూకీ లభ్యం

కొవ్వూరు: పట్టణ శివారు ఔరంగబాద్ ఇసుక ర్యాంపు వద్ద ఆదివారం గోదావరి నదిలో లభ్యమైన మృతదేహం ఆచూకీ లభ్యమైందని పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మృతుడు ధరించిన చొక్కాపై ఉన్న టైలర్ స్టిక్కర్ ఆధారంగా విచారణ చేశామన్నారు. జంగారెడ్డి గూడెం పట్టణానికి చెందిన పత్తిపాటి శ్రీవాసు సందీప్(38)గా గుర్తించినట్టు సీఐ తెలి పారు. నల్లజర్లకి చెందిన సందీప్ కొంత కాలంగా జంగారెడ్డిగూడెంలో ఉంటున్నాడు. ఆయనకి భార్య, ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు. భార్య లేపాక్షిదేవితో కొన్నాళ్లుగా వేర్వేరుగా ఉంటున్నారని అన్నారు. ఈ నేపథ్యంలో మనస్తాపంతో ఆత్మహత్య చేసుకొనంటారని భావిస్తున్నట్టు సీఐ తెలిపారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ


స్వామి వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: కుమారదేవం గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన కోదండ రామాలయం విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవం జరిగింది. ఉదయం మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం నిర్వహించారు. అనంతరం సీతారామ లక్ష్మణ ఆంజనేయ విగ్రహాలను శాస్త్రయుక్తంగా పునఃప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు పూజా కార్యక్రమాల్లో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భారీ అన్నసమారాధాన నిర్వహించారు. ఈ వేడుకల్లో జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ పోసిన శ్రీలేఖ, మండల వైఎస్సార్ సీపీ గౌరవ అధ్యక్షుడు గన్నమని వీర వెంకట్రాజు, నాయకులు గోలి శ్రీనివాస్, ఆడబాల దుర్గరావు, గోరిజాల పేర్రాజు, వైఎ స్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చిక్కాలపాలెంలో అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం, దారవరంలో పునర్నిర్మించిన కోదండ రామాలయంలో సీతారామ లక్ష్మణ హనుమాన్ విగ్రహల ప్రతిష్ఠ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. చిక్కాలపాలెంలో 30 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశారు. ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు, కొవ్వూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భావన రత్నకుమారి, ఎంపీపీ మట్టా వీరాస్వామి అభయాంజనేయస్వామివారికి పూజలు చేసి అభిషేకాలు చేశారు. ఈ పూజా కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లి తిరుమలరావు, కార్పొరేషన్ డైరెక్టర్ సంసాని రమేష్ తదితరులు పాల్గొన్నారు. దారవరంలో పునర్నిర్మించిన ఆలయంలో స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు పాల్గొని పూజలు చేశారు.

ఎన్నికలు సజావుగా సాగేలా సహకరించాలి

ఉండ్రాజవరం: ఎన్నికలు సజావుగా సాగేందుకు ప్రజలంతా సహకరించాలని ఎస్సై వి.అప్పలరాజు అన్నారు. పాలంగిలో ఎన్నికల ప్రవర్తన నియమావళిపై సోమవారం సాయత్రం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఎవరు అతిక్రమించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని, ఎంటువంటి అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొక్క శ్రీనివాసు, కార్యదర్శి హసన్‌జానీ, పాలాటి శరత్ బాబు, బొక్క శివకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.